సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 8 । జూన్ । 2023



పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎదులాపురం: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం సందర్భంగా ఆశ కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

రేషన్ డీలర్ల సమ్మె విరమణ

కైలాస్‌నగర్: గౌరవ వేతనం అమలుతో పాటు కమీషన్ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలనే డిమాండ్లతో చేపట్టిన సమ్మెను రేషన్‌డీలర్లు విరమించారు. డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు వారు ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాలు బుధవారం యథావిధిగా తెరుచుకున్నాయి. కార్డుదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం అందజేశారు.

గరిష్టం/కనిష్టం
42.0/30.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత కొనసాగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

దివ్యాంగుల భిక్షాటన



భిక్షాటనతో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: షరతులు లేకుండా ప్రతీ దివ్యాంగుడికి పింఛన్ మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. దివ్యాంగులకు పింఛన్ నిలిపివేయడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014లో ప్రభుత్వం 55మంది దివ్యాంగుల పింఛన్లను నిలిపివేసిందన్నారు. వాటిని వెంటనే పునరుద్ధరించి దివ్యాంగులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు వికాస్,శివ శంకర్, హుస్సేన్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం



బియ్యం పంపిణీ చేస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 9వ నంబర్ రేషన్ దుకాణాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అంజు,డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్ తదితరులున్నారు.

విద్యతోనే ముల్తానీల అభివృద్ధి



గ్రామాన్ని సందర్శిస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

ఇచ్చోడ: విద్యతోనే ముల్తానీలు అభివృద్ధి చెందుతారని, కలప స్మగ్లింగ్ మానుకుంటే ప్రభుత్వం నుంచి పునరావాస కల్పనకు కృషి చేస్తానని ట్రెయినీ కలెక్టర్ శ్రీజ అన్నారు. సిరిచెల్మలోని రోడ్డులో ఉన్న అటవీశాఖ వాచ్ టవర్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం గుండాల గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం స్థానికంగా తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను సైతం నియమించిందన్నారు. అయినా గ్రామంలో అక్షరాస్యత తక్కువగా ఉందన్నారు. బడీడు పిల్లలందరినీ బడికి పంపించాలన్నారు. చదువుతోనే సంస్కారం వస్తుందని అప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తారన్నారు. కార్యక్రమంలో టైగర్‌జోన్ ఎఫ్ఆర్వో వాహబ్‌అహ్మద్‌తో పాటు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'ను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎదులాపురం: కొత్తగూడెంలో ఈనెల 11న నిర్వహించనున్న లక్ష గొంతుల రణ నినాదం ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ఎన్నికల సందర్భంగా హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇందులో నాయకులు రాములు, భాస్కర్, అరుణ్ కుమార్, పొచ్చిరాం, సురేష్, నర్సింగ్‌రావు, గణపతి పాల్గొన్నారు.



ఇక్కడ సిమెంట్ బస్తాలతో కూడిన ఈ లారీ మహారాష్ట్రలోని పాటన్ బోరీ నుంచి వచ్చింది. అక్కడి నుంచి గుట్టుగా తెచ్చిన సిమెంట్‌ను జిల్లా కేంద్రంలోని టైలర్స్ కాలనీలో గల ఓ గోదాములో బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో అన్‌లోడ్ చేస్తుండగా స్థానిక డీలర్లు వాహనాన్ని అడ్డుకున్నారు. డ్రైవర్‌ను బిల్లులు చూపించాలని కోరగా అతను సేటు పంపించడంతో తీసుకువచ్చానని చెప్పాడు. తన వద్ద ఎలాంటి బిల్లులు లేవన్నాడు. దీంతో ఇది పక్కా జీరో మాల్ అని గుర్తించిన డీలర్లు సుమారు వంద సిమెంట్ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు.

జీరో దందా..

- మహారాష్ట్ర నుంచి జిల్లాకు అక్రమంగా సిమెంట్
- సీజీఎస్టీకి ఎగనామం.. జిల్లాలో గుట్టుగా విక్రయం
- చక్రం తిప్పుతున్న 'మహా' వ్యాపారి
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖ
- సర్కారు ఆదాయానికి భారీగా గండి

సాక్షి,ఆదిలాబాద్: మహారాష్ట్రలోని పాటన్‌బోరి కేంద్రంగా ఓ వ్యక్తి ఈ అక్రమ దందా నిర్వహిస్తున్నట్లు స్థానిక డీలర్లు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ చెల్లించకుండానే ఈ సిమెంట్ బస్తాలను స్థానికంగా ఆ వ్యాపారి విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. ఒక ఆదిలాబాద్ పట్టణానికే రోజూ లారీల్లో 2 వేలకు పైగా సిమెంట్ బస్తాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో బస్తాపై 14శాతం ఎస్‌జీఎస్టీ చెల్లించాల్సి ఉండగా దానికి ఎగనామం పెడుతున్నట్లు చెబుతున్నారు. స్థానికంగా కొంత మందిని మచ్చిక చేసుకుని మహారాష్ట్ర వ్యాపారి యథేచ్ఛగా ఈ అక్రమ దందా నిర్వహిస్తున్నాడని వాపోతున్నారు. దీంతో సర్కారు ఆదాయానికి గండి పడుతుందని అంటున్నారు.

అసలు జరగాల్సింది ఇలా..

తెలంగాణలో తయారైన సిమెంట్ ఇదే రాష్ట్రంలో వినియోగం అయిన పక్షంలో ఎస్‌జీఎస్టీ, సీజీఎస్టీ రూపంలో వాణిజ్య పన్నుల శాఖకు 28 శాతం చెల్లించాలి. అన్ని రాష్ట్రాలకు ఇదే విధానం వర్తిస్తుంది. ఒక వేళ ఒక రాష్ట్రంలో తయారైన సిమెంట్ మరో రాష్ట్రంలో వినియోగానికి తరలించినప్పుడు ఐజీఎస్టీ రూపంలో చెల్లించాలి. ఆ చెల్లింపు నుంచి 14 శాతం కేంద్రానికి, 14 శాతం వినియోగం అయిన రాష్ట్రానికి కేంద్రం నుంచి బట్వాడా అవుతుంది. అయితే మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ జిల్లాకు తీసుకువచ్చి విక్రయిస్తున్న సిమెంట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి ఎస్‌జీఎస్టీ చెల్లించకుండా అక్రమ దందా నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారంలో రాటుదేలిన ఓ మహారాష్ట్ర వ్యాపారి జిల్లాలో కొంత మంది డీలర్లను మచ్చిక చేసుకుని ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా ఎస్‌జీఎస్టీ చెల్లించి సిమెంట్ విక్రయించే డీలర్లతో పోలిస్తే మహారాష్ట్ర నుంచి తెచ్చి విక్రయిస్తున్న ఒక్కోబస్తాపై రూ.30 వరకు తక్కువగా ఉంటుంది. దీంతో వినియోగదారులు అటువైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర ఆదాయానికి గండి పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఆ శాఖ తీరుపై అనుమానాలు..

మార్కెట్‌లో ఈ దందా బహిరంగంగా సాగుతున్నా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టి అక్రమ దందాకు చెక్ పెట్టాల్సి ఉండగా అలాంటి చర్యలేవీ కనిపించకపోవడం వెనక పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నాయన్న ఆరోపణలున్నాయి. స్థానిక వ్యాపారులు అన్ని పన్నులు చెల్లించి సజావుగా వ్యాపారం నిర్వహించుకోవాలని చూస్తున్నా ఇలాంటి అక్రమ దందా కారణంగా వారి వ్యాపారం సాగని పరిస్థితుల్లో తామే ఈ అక్రమ దందా నివారించేందుకు వాహనాన్ని పట్టుకోవడం గమనార్హం. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ అధికారి యుగందర్ ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది.

సర్కారు బడిలో 'లిప్'

- అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం
- 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు..
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు

జిల్లాలో..
ప్రభుత్వ పాఠశాలలు : 229
6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య : 20,808



బోథ్: సర్కారు పాఠశాలల్లోని విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు తగ్గిపోతున్నాయని వివిధ సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆంగ్లంలోనే కాదు మాతృ భాష అయిన తెలుగులోనూ తడబడుతున్నట్లు స్పష్టమవుతోంది. గణితంలోనూ పిల్లలు వెనుకబడుతున్నారు. ఈ క్రమంలో ప్రాథమిక విద్య బలోపేతం కోసం విద్యా శాఖ గతేడాది తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంచి ఫలితాలు రావడంతో ఉన్నత పాఠశాలల్లో లిప్(లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) విధానానికి తెరతీశారు. 6 నుంచి 9 తరగతుల పిల్లలకు ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. త్వరలోనే జిల్లాలో ఉపాధ్యాయ నిపుణులతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అక్షర ప్రగతికి అనుగుణంగా..

కోవిడ్ నేపథ్యంలో ప్రత్యక్ష తరగతుల నిర్వహణ లేక కనీస విద్యా సామర్థ్యాలు తగ్గాయి. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక బోధనను గాడిలో పెట్టేందుకు విద్యాశాఖ పలు సంస్కరణలు అమలు చేస్తోంది. పిల్లల్లో తగ్గిన విద్యా ప్రమాణాలు పెంపొందించడం ద్వారా ఉన్నత విద్య పటిష్టం చేసేందుకు 'లిప్' రూపుదిద్దుకుంది. ఇందులో భాగంగా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో ప్రత్యేక బోధన చేయాలని నిర్ణయించారు. తొలిమెట్టు మాదిరిగానే ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు. విద్యార్థుల అక్షర ప్రగతికి అనుగుణంగా ఆయా సబ్జెక్టులపై పట్టు పెంచే ప్రయత్నం చేయనున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను నిశితంగా పరిశీలించి అంచనా వేయనున్నారు.

తరగతికి తగినట్టుగా సామర్థ్యం

విద్యాశాఖ అమలు చేయనున్న లిప్‌లో విద్యార్థుల వెనుకబాటుకు కారణాలు తెలుసుకొని వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకోనున్నారు. తరగతికి తగ్గ సామర్థ్యాలు పెంచడం, ధారాళంగా చదవడం, రాయడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. సబ్జెక్టుల వారీగా నైపుణ్యాలు పెంచడానికి ఇది దోహదపడనుంది. గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలతో పాటు భాషా ప్రావీణ్యం సాధించేలా శిక్షణ ఇస్తారు. విషయం వారీగా చర్చించి బోధనోపకరణాలతో అవగాహన కల్పిస్తారు.

నాణ్యతతో కూడిన విద్యా బోధన

ఉన్నత పాఠశాలల్లో లిప్ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇటీవల రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఎలా అమలు చేయాలనే విషయమై నిపుణులతో చర్చిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించడమే లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు.

నమూనా పరీక్షలో తడబాటు

తొలిమెట్టు తరహాలో ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (అస్కీ) లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టమ్ (సిప్స్), సేవ్ ది చిల్డ్రన్స్ సహకారంతో మార్చి 9 నుంచి 16 వరకు 6 నుంచి 9వ తరగతి విద్యార్థులపై ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించారు. ఇందులో అభ్యసన సామర్థ్యాల్లో పిల్లలు తడబడ్డారు. తరగతికి తగినట్లుగా నేర్చుకోవడం లేదని స్పష్టమైంది. తెలుగు, ఆంగ్లంతో పాటు కూడికలు, తీసివేతలు కూడా చేయడం లేదని తేలింది.

ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు..

విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా తొలిమెట్టు తరహాలోనే లిప్ కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేయబోతున్నాం. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులపై ఫోకస్ ఉంటుంది. రిసోర్స్‌పర్సన్లకు హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రత్యేక శిక్షణ సైతం పూర్తయింది.

– ప్రణీత, డీఈవో

సాగునీటితో తెలంగాణ సస్యశ్యామలం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్
- ఘనంగా సాగునీటి దినోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, చిత్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

బోథ్: రాష్ట్రం సిద్ధించిన తరువాత తెలంగాణ సస్యశ్యామలమైందని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగు నీటి ఇక్కట్లతో ఆత్మహత్యలు నిత్యకృత్యంగా ఉండేవన్నారు. నేడు స్వరాష్ట్రంలో నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోయి ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, రాష్ట్రం ఆవిర్భవించాక సాగు నీటి వనరులు పెరిగాయని తెలిపారు. దీంతో పంటల దిగుబడితో పాటు భూముల విలువ సైతం పెరిగిందన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల ఎస్ఈ రాము, డీఈ భీంరావ్, జేఈ జాధవ్ ప్రకాశ్, జెడ్పీటీసీ సంధ్యారాణి, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మన్ సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లింబాజీ, సర్పంచ్ సురేందర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు జగన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్ పాల్గొన్నారు.

'పెన్‌గంగ' ఘనత బీఆర్‌ఎస్‌దే..



ప్రగతి ప్రవాహం పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌రూరల్: జిల్లావాసుల చిరకాల ఆకాంక్ష అయిన పెన్‌గంగ ప్రాజెక్టు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మావల మండల శివారులోని ఓ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన సాగు నీటి దినోత్సవా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాగు నీటి రంగంలో ప్రగతి ప్రవాహం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. నీటి పారుదల శాఖ ద్వారా చేపట్టిన ప్రగతి పనుల వివరాలను ఈఈ రవీందర్ వెల్ల డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పో రా డి సాధించుకున్న తెలంగాణలో నీళ్ల, నిధులు,ని యామకాలే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌అడ్డి భో జారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, మావల తహసీల్దార్ ఇమ్రాన్, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.

బీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష సాయం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నటరాజ్

కైలాస్‌నగర్: బీసీ కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష ఆర్థిక సాయాన్ని జూన్ 9న సంక్షేమ సంబురాల్లో భాగంగా లాంఛనంగా ప్రారంభించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కుల, చేతివృత్తుల వారికి ఆర్థిక సాయం కింద రూ.లక్ష అందించనుందన్నారు. జూన్ 9న ఈ కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఈనెల 20 వరకు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే జూన్ 9న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈనెల 14న నిర్వహించే వైద్య దినోత్సవాన్ని పండుగ వాతవరణంలో నిర్వహించాలన్నారు. వైద్యశాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవార్డులు, మహిళ ఉద్యోగులకు చీరలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సంక్షేమ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా చేపట్టాలన్నారు. అదే రోజు రెండో విడత గొర్రెల పంపిణీకి చర్యలు తీసుకోవాలని రెండు నియోజకవర్గాలలో యూనిట్ల పంపిణీకి సిద్ధం చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతా, బీసీ,ఎస్సీ, స్త్రీశిశు సంక్షేమ అధికారులు రాజలింగం, సునీత కుమారి, మిల్కా,ఎస్సీ కార్పొరేషన ఈడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మరింత 'మద్దతు'



మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర పెంచుతూ రైతులకు తీపి కబురు అందించింది. 17 పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర పెంచుతూ గురువారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి సోయాబీన్, కంది పంటలు అధికంగా సాగవుతుండగా.. పెంచిన ధరలు పత్తి, సోయాబీన్, కంది, పెసర పంటలకు కాస్త ఊరటనివ్వగా వరి పంట ధర అన్నదాతను నిరాశకు గురి చేసింది. ఉమ్మడి జిల్లాలో 17.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. అధికంగా నువ్వు, పెసర పంటలకు పెంచారు. కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ) సూచించిన ధరలు సాగుకయ్యే ఖర్చు కన్నా తక్కువగానే ఉన్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అనుగుణంగా ధరలు పెంచాలని గత కొద్ది రోజుల క్రితం సీఏసీపీకి విజ్ఞప్తి చేసింది. రైతు కమిటీల సిఫారసులు ప్రకారం సాగుకు చేసే ఖర్చుకు అదనంగా మరో 50 శాతం కలిపి ధర ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఏటేటా పెరుగుతున్న పెట్టుబడి

మంచిర్యాల జిల్లాలో 1.60 లక్షల రైతులు ఉండగా.. 3.65లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో 1.70 లక్షల మంది రైతులు ఉండగా.. 5.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా పత్తి, సోయా తదితర పంటల సాగు విస్తీర్ణం ఉంది. అయితే రెట్టింపైన పెట్టుబడులు రైతులకు కన్నీరు తెప్పిస్తున్నాయి. పెట్టుబడికి, రాబడికి పొంతనలేని దుస్థితి. ఏటా పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం రైతులను అప్పుల సుడిగుండలో చిక్కుకునేలా చేస్తోంది. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడుతుంటే మరో వైపు ప్రభుత్వం చిన్నచూపుతో పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతుకు సాగు భరోసా లేకుండా పోతుంది. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు, కూలి, వ్యవసాయ యంత్రాల ధరలు ఏటేటా భారీగా పెరుగుతున్నాయి. ఎకరం వరి సాగు పెట్టుబడి రూ.30 వేలు, పత్తి సాగు రూ.40 నుంచి రూ.45 వేలు, కంది రూ.30 వేలు, సోయాబీన్ రూ.20 నుంచి రూ.25 వేలు, మొక్కజొన్న రూ.20 వేల వరకు వరకు ఖర్చు అవుతుంది. దీంతోపాటు ఈ ఏడాదైన పత్తి క్వింటాలుకు రూ.8 వేలు, వరికి రూ.3 వేలు, సోయాకు రూ.5 వేల వరకు చెల్లించాలని పలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పెట్టుబడులు ప్రభుత్వానికి వివరించినా ఫలితం లేకుండా పోయింది.

పెరిగిన ధరలు(క్వింటాల్‌కు రూ.లలో)

పంట	గతేడాది	ఈ ఏడాది	పెరిగింది
పత్తి	6,380	7,020	640
వరి	2,060	2,183	143
కంది	6,600	7,000	400
పెసర	7,755	8,558	803
సోయాబీన్	4,300	4,600	300
నువ్వులు	7,830	8,365	985
మొక్కజొన్న	1,962	2.090	128
వేరుశనగ	5,850	6,377	527
జొన్న	2,990	3,225	235
మినుము	6600	6,950	350
రాగులు	3,578	3,846	268

క్లుప్తంగా

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని రాంజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ అందించేందుకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీడీ దిలీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు ఇందుకు అర్హులని, అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలు మించరాదని, అభ్యర్థులు http//studycircle.cgg.in వెబ్‌సైట్‌లో లో ఈ నెల 9 నుండి జూలై 8 తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6281766534 సంప్రదించాలని కోరారు.

సాయానికి కదులుతున్నారు...



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

సాక్షి ఎఫెక్ట్

బోథ్: మండలంలోని గుర్రాలతాండ గ్రామంలో దీన పరిస్థితులోని మల్హారి సింగ్ కుటుంబంపై సాక్షిలో ఈ నెల 3వ తేదీన ×ఇంటికి పెద్ద దిక్కు.. ఆ చిన్నారి₹ అనే కథనానికి స్పందన లభిస్తోంది. బుధవారం మదర్ డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థలో సాక్షిలో వచ్చిన కథనానికి బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. గ్రామస్తులతో కుటుంబం పరిస్థితిపై చర్చించారు. కొంతమంది దాతలు ఫోన్‌పే ద్వారా నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు జీవన్‌రెడ్డి, సభ్యులు రాకేష్, సునీల్, అబ్దుల్, అల్మాస్ ఉన్నారు.

నిద్రమత్తులో భవనం పైనుంచి పడి ఒకరి మృతి

భైంసాటౌన్: నిద్రమత్తులో భవనం పైనుంచి కిందపడి ఒకరు మృతిచెందిన ఘటన భైంసాలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ ఎల్.శ్రీను వివరాల ప్రకారం.. మండలంలోని గుండెగాం గ్రామానికి చెందిన గిరి దత్తు(52) భార్య లక్ష్మిబాయితో కలిసి భైంసాలోని ఎన్‌బీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే దత్తు మంగళవారం రాత్రి భార్యతో కలిసి మొదటి అంతస్తులో కాసేపు ఆరుబయట కూర్చున్నాడు. భార్యకు నిద్ర రావడంతో ఆమె ఇంట్లోకి వెళ్లి పడుకుంది. తెల్లవారి లేచేసరికి భర్త ఇంటి పక్కనే కింద పడి మృతి చెంది కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 27మందికి జరిమానా

ఖానాపూర్: ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇటీవల కాలంలో 28మంది పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఖానాపూర్ కోర్టు మెజిస్ట్రేట్ జితిన్ 27మందికి రూ.1000 చొప్పున జరిమానా విధించడంతో పాటు ఒకరికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు.

మస్కాపూర్‌లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పివేస్తున్న స్థానికులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామంలోని అంబటి శ్రీనుకు చెందిన పశువుల పాకలో షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివాముతో పాటు నూతన బైక్ పూర్తిగా దగ్ధమైంది. పశువుల పాకలో ఇంటి కోసం నిల్వ ఉంచిన 30 ధాన్యం బస్తాలు సైతం కాలిబూడిదయ్యాయి. దీంతో సుమారుగా రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. స్థానికులతో పాటు ఫైర్ సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. సకాలంలో మంటలు ఆర్పకుంటే సమీపంలోని నివాసాలకు సైతం మంటలు వ్యాపించేవి.



చేపల కోసం క్యూ..







మృగశిర కార్తె ఒక్కరోజు ముందే నిర్మల్ జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్లో విక్రయం జోరందుకుంది. మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేసేందుకు బుధవారం జనం ఎగబడ్డారు. వివిధ రకాల చేపలతో పాటు ఒక్కొక్క చేప పది నుంచి 20కిలోల ఉండగా, మార్కెట్ కొనుగోలుదారులతో సందడి నెలకొంది. జిల్లాలో గొలుసుకట్టు చెరువులతో పాటు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ ఉండడంతో మత్స్యకారులు వివిధ రకాల చేప పిల్లలను పట్టి మార్కెట్‌కు తీసుకొచ్చారు. బంగారు తీగలు, రొయ్యలు. రావట, మొట్ట పిల్లలతో మార్కెట్ కళకళలాడింది. బోయవాడ డిపో ముందు టెంట్లు వేసి చేపలను విక్రయించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఎస్టీ హోదా సాధించే వరకూ పోరాటం



మాట్లాడుతున్న మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

తలమడుగు: ఎస్టీ హోదా సాధించే వరకూ పోరాటం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. తలమడుగు మండలం బరంపూర్‌లో బుధవారం మాలి పటేళ్ల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలి పటేళ్లు మాలీలను ఏకతాటిపైకి తేవాలని సంఘటితంగా ఉంటేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాలీలకు ఎస్టీ హోదా విషయమై తీర్మాణం చేస్తాయని అన్నారు. 22ఏళ్ల పోరాటానికి అప్పుడే న్యాయం జరిగి ఎస్టీ హోదా లభిస్తుందని, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకెళ్లగలుగుతారన్నారు. ఈ నెల 9వ తేదీన తాంసి, తలమడుగు మండలాల రెవెన్యూ మండలాధికారులు, ఎస్సైలను కలిసి మాలీ సంఘ అధ్యక్షుడు సంతకాలతో కూడిన వినతి పత్రాలు అందించాలన్నారు. కుల ధృవీకరణ పత్రాలు, కల్యాణలక్ష్మి లాంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంఘం పెద్దలు పెట్టిన సంతకాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. అలా కాకుండా వేరే వారు చేసిన సంతకాలను పరిగణలోకి తీసుకోకూడదని, కొంతమంది అధికారులు సంఘం అధ్యక్షుడి సంతకం లేకుండానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే కలెక్టర్‌ని కలిసి విన్నవిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న సేండే కుచులాపూర్ మహాజన్ విలాస్ సెండే, బరంపూర్ మహాజన్ వినోద్ గుర్నులే, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అంబేకర్ చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట్రంగే అనిల్, ఉత్తం మాందాడే, రమేష్ గురునూలే పాల్గొన్నారు.

గొర్రెల కోసం ఏపీలో యాదవుల గోస



మాచర్లలో నిర్మల్ జిల్లా గొర్రెల లబ్ధిదారులు

ఖానాపూర్: జిల్లాలోని సారంగపూర్, ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన యాదవులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి నాలుగు రోజులుగా అక్కడే పడిగాపులు కాస్తున్నారు. సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు ముందుగా గుంటూరుకు వెళ్లారు. ఆ తర్వాత అధికారుల సూచన మేరకు కడపతో పాటు పల్నాడు జిల్లా మాచర్లకూ వెళ్లారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. దారి ఖర్చుల కోసం తెచ్చుకున్న డబ్బులు కూడా అయిపోగా ఎండలో రోడ్లపై ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం లాడ్జిల్లో ఉంటూ తమను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



పరీక్షిస్తున్న అదనపు వైద్యాధికారి కుమురం బాలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుమురం బాలు అన్నారు. బుధవారం గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామ పంచాయతీ పరిధిలోని గొండుగూడ, కొలాంగూడ, అంద్‌గూడ గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. మూడు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులతో పాటు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామ స్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని అన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించాలని సూచించారు. బుధవారం మూడు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో మొత్తం 130 మంది రోగులు, ఏడుగురు గర్భిణులను పరీక్షించినట్లు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైనా వైద్యం అందించాలని సూచించారు. రోగులపై నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. దంతన్‌పల్లి ఎంసీహెచ్ టీం డాక్టర్ అంకిత్‌రెడ్డి, ఇంద్రవెల్లి ఎంసీహెచ్ టీం డాక్టర్ కార్తీక్, సురేశ్, శిరీష్ అడిషనల్ డీఎంహెచ్‌వో సిబ్బంది, హెచ్‌ఈవో రాథోడ్ తులసిదాస్, ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

- నాలుగు దుకాణాలపై కేసులు



తనిఖీ నిర్వహిస్తున్న అధికారి జలీల్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో బుధవారం తునికల కొలతల శాఖ జిల్లా అధికారి ఎం.ఏ జలీల్ ఆకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. నేహ ఏజెన్సీ, సాయి నాథ్ ఆగ్రో ఏజెన్సీ, హరిహోం ఆగ్రో ఏజెన్సీ దుకాణ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కొన్ని పత్తి రకాల విత్తనాలపై తయారు చేసిన కంపెనీ పేరు లేకపోవడం, కొన్ని రకాల విత్తనాలపై యూనిట్ సెల్, ధర, బరువు ఎంత కనిపించకపోవడంతో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విత్తనాల ప్యాకెట్లపై ధర, బరువు, తయారు చేసే కంపెనీ పేరు తప్పనిసరిగా ఉండాలని, జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెంపుడు జంతువును చంపిన వారిపై కేసు నమోదు

లక్ష్మణచాంద: పెంపుడు జంతువును చంపిన మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఎంజలి ఆనంద్‌కు పెంపుడు కుక్కను పొట్టపెల్లి (కె) గ్రామానికి చెందిన శ్రీనివాస్, చామన్‌పెల్లి గ్రామానికి చెందిన వరుణ్ అనే ఇద్దరు వ్యక్తులు అపహరించారు. దీంతో ఆనంద్ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన పెంపుడు జంతువును చంపి జింక మాంసం పేరుతో విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో..

నలుగురు యువకుల మృతి

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బుధవారం నలుగురు యువకులు వేర్వేరు కారణాలతో మృతిచెందారు. లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన యువకుడు గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో మృత్యువాతపడగా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అలాగే ఆదిలాబాద్‌రూరల్ మండలంలో ఓ యువకుడు పాముకాటుకు గురై మృతిచెందగా, ఇచ్చోడ మండలంలో బైక్‌పై నుంచి పడి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇంద్రవెల్లి మండలంలో వడదెబ్బ తగలడంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మరో యువకుడు విగతజీవిగా మారాడు. ఈ సంఘటనలతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

దుబాయ్‌లో లక్ష్మణచాంద వాసి..

లక్ష్మణచాంద: బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లిన యువకుడు అనారోగ్యంతో మృతిచెందిన విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ పడతం శ్రీనివాస్ (23) కొద్ది నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. అనారోగ్యంతో బుధవారం రూములోనే మృతిచెందాడు. శ్రీనివాస్ మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తన రూములోని మిత్రులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పాముకాటుతో యువకుడు..

ఆదిలాబాద్‌రూరల్: పాముకాటుతో మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన గోకుల ఆనంద్ రావ్ మంగళవారం మృతి చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ రావ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పొచ్చర గ్రామానికి చెందిన ఆనంద్ రావ్(33) గ్రామంలోని బస్టాండ్ సమీపంలో కిరాణ షాపును కొనసాగిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇదే క్రమంలో మంగళవారం పాము షాపులోకి చొరబడి కాలు కాటువేయడంతో స్థానికులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. ఆనంద్‌రావుకు ఏడాది క్రితమే వివాహం కాగా మూడు నెలల కూతురు, భార్య శిరీష ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

ఇచ్చోడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని ముఖరా(బి) గ్రామానికి చెందిన బాలే శ్రీనివాస్(17) బైక్‌తో వేగంగా వెళ్లడంతో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో..



ఆడ వినోద్ (ఫైల్)

ఇంద్రవెల్లి: వడదెబ్బతో యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలోని దుబ్బగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... మండలంలోని దుబ్బగూడ గ్రామానికి చెందిన ఆడ హనుమంత్ రావ్, రాధాబాయి దంపతుల పెద్ద కుమారుడు ఆడ దినేశ్ (19) మంగళవారం ఎండలో తిరిగాడు. బుధవారం తెల్లవారు జమునా వాంతులు, విరేచనలు కావడంతో కుటుంబీకులు వెంటనే మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించేందుకు సిద్ధం అవుతుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

నిండా ముంచిన వైన్ యాప్!

- పేట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు
- యాప్‌ల పేరిట బురిడీ కొట్టిస్తున్న మోసగాళ్లు



చెన్నూర్: సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త యాప్‌లతో లాభాల ఆశలు చూపి కోట్లు కొల్లగొడుతున్నారు. వైన్‌యాప్ పేరుతో చెన్నూర్ మండలానికి చెందిన అమాయకులను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొంతమంది వైన్ వ్యాపారం పేరుతో యాప్ ఏర్పాటు చేశారు. వచ్చిన ఆదాయాన్ని పెట్టుబడిదారులకు రెట్టింపు లాభాలను పంపిస్తామని ఆశ చూపారు. కొత్తలో పెట్టిన పెట్టుబడికి లాభాలను పంపించి నమ్మించారు. దీంతో చైన్ సిస్టమ్ ద్వారా లక్షలాది మంది యాప్‌లో చేరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ఆశపడ్డ ప్రభుత్వ, ప్రైవేట్, సింగరేణి ఉద్యోగులతో పాటు చిరువ్యాపారులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. బిచానా ఎత్తేయడంతో లబోదిబో మంటున్నారు. జిల్లాలోని చెన్నూర్, కోటపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, సింగరేణి ప్రాంతానికి చెందిన వారు పెద్ద ఎత్తున ఉన్నట్లు తెలిసింది.

లాభాల ఆశతో...

చెన్నూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన నరిశెట్టి రాకేశ్ గత నెల 18న వైన్ యాప్‌లో చేరి రూ.37,500 పెట్టుబడి పెట్టాడు. 19 నుంచి రోజుకు 2,268 చొప్పున పది రోజుల పాటు రూ.22,680 వచ్చాయి. దీంతో అతని ఆశకు అంతులేకుండా పోయింది. తన భార్య పేరిట మరో రూ.55వేలు పెట్టాడు. పది రోజుల పాటు లాభాలను పంపించిన నిర్వాహకులు గత నెల 30 నుంచి ఆపేశారు. యాప్‌లో డబ్బులు ఫెయిల్ అని కన్పించడం ప్రారంభించింది. మోసపోయానని గుర్తించాడు. జిల్లాలో రాకేశ్ లాంటి వారు వేలాది మంది ఉన్నారు.

నాలా ఎవరూ మోసపోకండి



చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఈజీమనీకి ఆశపడి మోసపోయా. సైబర్ నేరగాళ్లు అమాయకులకు డబ్బు ఆశచూపి దండుకుంటున్నారు. నాలా చాలామంది మోసపోయారు. ఎవరూ బయటికి రావడంలేదు. మరికొంత మంది మోసపోవద్దని ముందుకు వచ్చా.

– నరిశెట్టి రాకేశ్, గంగారం, చెన్నూర్

అత్యాశకు పోవద్దు



సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు ఎక్కువగా ఇస్తామంటే అత్యాశకు వెళ్లి మోసపోవద్దు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇప్పటి వరకు వైన్ యాప్ బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. పోలీసులను సంప్రదిస్తే పరిశీలిస్తాం.

– వాసుదేవరావు, సీఐ చెన్నూర్

శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎదులాపురం: రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ మహిళా కుస్తీ యోధులపై బీజేపీ పార్లమెంటు సభ్యులు, రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను వెంటనే అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని, చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసి పతకాలు సాధించిన రెజ్లర్లు దేశ రాజధానిలో గత కొన్ని రోజులుగా పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఎంపీపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెర్క దేవిదాస్, అరుణ్, లక్ష్మి, అనిల్, అనురాధ, అనిత, సునీత, మణెమ్మ, రాజమణి, ప్రేమకల, సంగీత, విజయ ఉన్నారు.